

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 48 మందికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుల ప్రదానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రితో పాటు కలెక్టర్ రాజకుమారి, డీఈవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని అందుకు అనుగుణంగా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేలా ప్రతి టీచర్ అంకితభావంతో పనిచేయాలన్నారు. తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్ అండ్ గైడ్స్ వంటివి ప్రతి స్కూలులో ఉండడంతో చదువుతో పాటు లీడర్‌షిప్ క్వాలిటీ పెరుగుతుందన్నారు. ప్రతిస్కూల్‌లో గోడలపై మంచి సూక్తులు రాయించాలని సూచించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 48 మందికి అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు.





అవార్డులు అందజేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి





అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాకు 2,600 టన్నుల యూరియా

- రైతులు ఆందోళన చెందొద్దు
- కలెక్టర్ రాజకుమారి



రైల్వే వ్యాగన్ల ద్వారా నంద్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకున్న యూరియా బస్తాలు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు 2600 టన్నుల యూరియా చేరుకుందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు చేరిన 2,600 యూరియాను 91 రైతు సేవా కేంద్రాలకు 1,820 టన్నులు, రిటైల్ వ్యాపారులకు 780 టన్నులు పంపించామన్నారు. శనివారం ఉదయం మరో 2,600 టన్నుల యూరియా నంద్యాలకు చేరుకుంటుం దన్నారు. అందులో మరో 69 ఆర్ఎస్‌కేలకు 1,425 టన్నులు, రిటైల్ వ్యాపారులకు 1,175 టన్నులు అందిస్తామన్నారు. ఇఫ్కో కంపెనీ ద్వారా మరో 1500టన్నులు గుజరాత్ నుంచి లోడ్ కావడం జరిగిందని, జిల్లాకు చేరుకున్న వెంటనే వాటిని కూడా ఆర్ఎస్‌కేలకు, రిటైల్ వ్యాపారులకు అందజేస్తామన్నారు. ఏఒక్క రైతు కూడా ఆందోళన చెందవద్దన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు యూరియా కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించారన్నారు. యూరియా పక్కదారి పట్టినట్లు గుర్తించిన వెంటనే కమాండ్ కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని కోరారు. ఏఒక్క బస్తా దుర్వినియోగమైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బారులు దీరారు..!

- రాత్రిపూట యూరియా పంపిణీ

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు శుక్రవారం 2,600 టన్నులు చేరుకోవడంతో సాయంత్రానికి జిల్లాలోని 91 రైతుసేవాకేంద్రాలకు యూరియా సరఫరా చేశారు. దీంతో రైతులు యూరియా కోసం పాస్ బుక్‌లు చేతబట్టుకుని రైతు సేవా కేంద్రాలకు చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయమైనా రైతులు యూరియా కోసం బారులు తీరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఆదేశించడంతో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాత్రి 11 గంటల వరకు యూరియాను రైతులు పంపిణీ చేశారు.



రాత్రి 10 గంటలకు కూడా రైతులకు యూరియా పంపిణీ



గాజులపల్లె ఆర్ఎస్‌కేలో యూరియా కోసం రాత్రి సమయంలో కూడా బారులు దీరిన రైతులు

కాలుష్య బట్టీలు

- పరిసరాల్లో కమ్ముకుంటున్న పొగ కాలుష్యం
- పుట్టగొడుగుల్లా ఇటుకల బట్టీలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- యథేచ్ఛగా జీరో వ్యాపారం

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని ఇటుక బట్టీలు కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. బట్టీల యజమానులు తక్కువ ఖర్చు అధికలాభాలు గడిస్తూ శివారు కాలనీలను కాలుష్యానికి గురిచేస్తున్నారు. తనిఖీలు అటుంచి అధికారులు అటువైపు వెళ్లకపోవడంతో యథేచ్ఛగా జీరో వ్యాపారం కొనసాగుతోంది. ఇటుకల కోసం కావాల్సిన ఎర్రమట్టిని సైతం అక్రమంగా తెచ్చుకుంటున్నా అడిగే నాథుడేలేడు. ఇదిలా ఉండగా ఇటుకలను కాల్చేందుకు రైల్వే బొగ్గును వినియోగించడం గమనార్హం.

బొగ్గు అక్రమమా.. సక్రమమా?

ఈ బొగ్గు అక్రమమా, సక్రమమా అనేది ప్రశ్నార్థకం. రైల్వే శాఖ ఉపయోగిస్తున్న బొగ్గును టన్నుకు రూ.6వేలతో కొనుగోలు చేస్తున్నట్లు పలువురు బట్టీ యజమానులు చెబుతున్నారు. ఈ బొగ్గు మదనపల్లె ప్రాంతం నుంచి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. నంద్యాల పట్టణ శివారు ప్రాంతాలైన పొన్నాపురం, పెద్దకొట్టాల, అయ్యలూరు మెట్ట ప్రాంతాల్లో ఇటుకల బట్టీలు అధికంగా ఉన్నాయి. దాదాపు 50కిపైగా బట్టీల యజమానులు ఇటుకలను తయారుచేసి విక్రయిస్తున్నారు. ఎక్కువశాతం ఇటుకల బట్టీలను రాత్రివేళల్లో కాలుస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే బట్టీలను ఏర్పాటుచేసి ఇటుకలను కాలుస్తున్నారు. ముఖ్యంగా అయ్యలూరిమెట్టలో బట్టీల నుంచి వస్తున్న పొగతో ఎదుటి వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగిన సంఘటనలూ లేకపోలేదు. అంతేకాకుండా బట్టీలనుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఇటుకల తయారీకోసం సిద్ధంగా ఉంచిన ఎర్రమట్టి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇటుకలు

ఎర్రమట్టి తరలింపు సక్రమమేనా ?


ఇటుకలు తయారుచేసేందుకు వాడుతున్న ఎర్రమట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా లేదా అనేది అంతుచిక్కని ప్రశ్న. బోయల కుంట్ల చెరువు, గాజులపల్లె సమీపంలోని అంకిరెడ్డి చెరువుల నుంచి ఎర్రమట్టిని ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుకల బట్టీల యజమానులు మాత్రం టిప్పర్ రూ.7వేలకు కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. రవాణా చేసే టిప్పర్ యజమానులు అక్రమంగానే ఎర్రమట్టిని తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎర్రమట్టి తవ్వకాలపై అటవీశాఖ అనుమతులున్నాయా లేక ఆమ్యామ్యాలతో పనికానిచ్చేస్తున్నారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

కన్నెత్తి చూడని కాలుష్య నివారణ అధికారులు

ఇటుకల బట్టీలతో వస్తున్న కాలుష్యంతో అటు వాహనదారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాలుష్య నివారణ అధికారులు అటువైపు కన్నెత్తిచూడకపోవడం విడ్డూరం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధికారులు తనిఖీలుచేసి కాలుష్యాన్ని నివారించాల్సి ఉండగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీశైలానికి తగ్గిన వరద

- డ్యాం గేట్లు మూసివేత
- నీటి నిల్వ సామర్థ్యం 208 టీఎంసీలు



మూసివేసిన గేట్లు

శ్రీశైలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద తగ్గింది. గురువారం గేట్లు తెరిచిన అధికారులు శుక్రవారం వాటిని మూసివేశారు. గడిచిన 24 గంటల్లో రెండు విద్యుత్ కేంద్రాల్లో 32.379 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి గావించి జెన్‌కో అధికారులు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఎగువ పరివాక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల నుంచి 1,15,383 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శ్రీశైలం డ్యాం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం రెండు విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 66,327 క్యూసెక్కులు విడుదల చేయడం జరుగుతుంది.

టమోటా కిలో రూ.4

- పత్తికొండ మార్కెట్‌లో భారీగా పతనమైన ధర
- అన్నదాతకు తీవ్ర నష్టం



టమోట పంట

దేవనకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.4 పలికింది. ఈనెల 4న 25 కేజీల టామోటా బాక్సు రూ.350 పలుకగా.. శుక్రవారం రూ.250 తగ్గి రూ.100 పలికింది. కూలీ, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో టమోటా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పైగా వర్షాలతో కాయలపై మచ్చలు, చెట్టుపైనే ఎర్రపండు కుళ్లిపోతోంది. రైతులు పంట సంరక్షణ కోసం అవస్థలు తప్పడం లేదు. అధిక వర్షాలకు టమోటా పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతులకు పెట్టుబడుల భారంతో అప్పుల తిప్పలు తప్పడం లేదు. మచ్చల నివారణ కోసం ఐదు సార్లకు పైగానే పురుగుల మందులను పిచికారీ చేయాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా బోర బావుల కింద, వర్షాధారం కింద టమోట పంటను సాగు చేశారు.

రూ.400 నష్టం కలిగింది



ఎకరాన్నర పొలంలో టమోటా సాగు చేశాను. లద్దె పురుగు, పచ్చదోమ నివారణకు, కాయకు మచ్చ తెగుళ్లు సోకకుండా ఎనిమిది సార్లు స్ప్రే చేశాను. నాలుగుసార్లు భూసారం కోసం భూమిలో నాలుగుసార్లు మందు విత్తాను. రూ.30 వేల వరకు ఖర్చు పెట్టాను. మొదటి కోతకు 20 బాక్సులు దిగుబడి వచ్చింది. పత్తికొండ మార్కెట్‌కు పంట దిగుబడిని తరలిస్తే బాక్సు (25 కిలోలు) రూ.100 పలికింది. ఆరుగురితో పంట కోత కోశాను. వారికి రూ.1,800 ఖర్చు అయింది. ఆటో బాడుగ రూ.600. దీంతో రూ.400 నష్టం కలిగింది.

● నాగరాజు రైతు, దేవనకొండ

యువతకు ఆదర్శం.. సురవరం
● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
7

రూ.30కోట్లతో ఉడాయించాడు.. వారణాసిలో దొరికాడు..!

విధేయతకు గుర్తింపు

- కర్నూలు 29వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు
- రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక




పాణ్యం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి చేసిన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించిందని కర్నూలు 29వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శిండిగేరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావును పాణ్యం నియోజకవర్గం నుంచి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దలకు, గౌరు కుటుంబానికి, మల్లెల రాజశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసరావు విద్యార్థి దశనుంచి కమ్యూనిస్టు భావాలతో పలు ఉద్యమాలు చేపట్టారు. గోనెగండ్ల మండలం, పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. జిల్లా ఫార్మా మేనేజరు యూనియన్ వ్యవస్థాపక సభ్యులుగా, చిత్తూరు జిల్లా మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. గౌరు కుటుంబంతో ఉన్న సత్సంబంధాలతో టీడీపీలో చేరిపార్టీకి సేవలందించారు. 2021లో కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 15 యేళ్లుగా బ్రాహ్మణ సామాజికవర్గం ఓట్లు టీడీపీకి వేయించడంలో తన వంతు కృషి చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




ఘనంగా ముగిసిన గణేశ్ నిమజ్జనోత్సవం

● శుక్రవారం మధ్యాహ్నం వరకు కొనసాగిన నిమజ్జనం
● భరతమాత గణనాథుడికి తుది వీడ్కోలు


నగరంలో భరతమాత గుడిలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాన్ని చివరగా నిమజ్జనం చేస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో తొమ్మిది రోజులుగా కన్నుల పండువగా సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఉదయం 11:30 గంటలకు చివరి విగ్రహం నిమజ్జనంతో వైభవంగా ముగిశాయి. నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూకాలనీలో గల భరత మాత గుడి (విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం ఆవరణ)లోని విఘ్ననాయకుడి విగ్రహాన్ని చివరగా ఉత్సవ ప్రతినిధులు నిమజ్జనం చేశారు. అనంతరం హర్షాతిరేకాల మధ్య గణేశ్ నిమజ్జనోత్సవం పూర్తయినట్లు ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మంటపాలలో రెండు వేలకు పైగా విగ్రహాలు నెలకొల్పగా, వాటిని నిర్వాహకులు గురువారం రోజున ఆలస్యంగా తరలించారు. వినాయక ఘాట్‌లోనూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన విగ్రహాల నిమజ్జన ప్రారంభం ఆలస్యంగానే మొదలైంది. దీంతో శుక్రవారం ఉదయం వరకు భారీ విగ్రహాలను కేసీలో నిమజ్జనం చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, బి. వేణుగోపాల్, గోరంట్ల రమణ, ఎస్. రంగస్వామి, మాళిగి భానుప్రకాశ్, టి. ప్రతాపరెడ్డి, అక్కెం విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమష్టి సహకారంతో నిమజ్జనోత్సవం విజయవంతంగా పూర్తయిందని, వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. పోలీసు అధికారుల ముందస్తు బందోబస్తు చర్యలతో శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు కొనసాగాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా భక్తులు సంతోషంగా ఈ నిమజ్జనోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.



ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి

● ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్నట్లు వీసీ

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వన్నె తెచ్చిన మహనీయులు అని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్లు సుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీలో..

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. మహబూబ్ బాషా, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌ఎస్‌ఎం హుస్సేనీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి విరాళంగా కారు

● రూ.34 లక్షలు విలువ చేసే వాహనాన్ని అప్పగించిన ఎస్‌బీఐ అధికారులు



కారును విరాళంగా ఇస్తున్న ఎస్‌బీఐ అధికారులు

మంత్రాలయం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎస్‌బీఐ తరఫున రూ.34 లక్షలు విలువ చేసే ఇన్నోవా కారును విరాళం అందజేశారు. ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదేశాల మేరకు శుక్రవారం మఠం ముఖద్వారం ముందు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, సుమన్, డీజీఎం హేమ ఆధ్వర్యంలో రూ.34 లక్షల విలువ చేసే ఇన్నోవా కారును పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులుతో పూజ చేయించి శ్రీమఠానికి అప్పగించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, మంత్రాలయం బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్ సమక్షంలో జెండా ఊపి రిబ్బన్ కట్ చేసి కారును శ్రీమఠానికి అందించారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్, డిప్యూటీ మేనేజర్లు రామచంద్ర నాయక్, నరేంద్ర, మహేష్, ప్రసాద్, ఉరుకుందమ్మ, రవి, సర్దార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

200 గదుల నిర్మాణానికి భూమి పూజ

● పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు



భూమి పూజలో పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు, పీఠాధిపతి తదితరులు

మంత్రాలయం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని సుయతీంద్రతీర్థుల 200 వసతి గృహంపైన 3, 4 అంతస్థుల్లో మరో 200 గదులు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నడాఫ్, జస్టిస్ ఉమాదేవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజా ఎస్.గిరిరాజాచార్, తెలంగాణ పశువైద్యశాఖ జాయింట్ సెక్రటరీ అమ్మెన్ కుమార్‌తో కలిసి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భూమి పూజ చేశారు. మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్ ఆధ్వర్యంలో శాంతి పూజలు చేసి ప్రారంభించారు. పీఠాధిపతి మాట్లాడుతూ భక్తులు ఇచ్చిన రూ.12 కోట్లతో మూడో అంతస్థులో 100 గదులు, నాలుగో అంతస్థులో 100 గదులు నిర్మించనట్లు తెలిపారు. ఈ 200 గదులను వచ్చే రాఘవేంద్రస్వామి ఉత్సవల నాటికి అందుబాటులోకి తెచ్చేలా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. మరో 100 గదుల నిర్మాణానికి భక్తుల నుంచి దాతల నుంచి విరాళాలు వచ్చాయని, త్వరలో భూమి పూజకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మఠం ఏఈ హరిదాస్, సీఆర్వో ఎ.బద్రీనాథ్, రామాంజినేయులు, డోన్ రాఘవేంద్రాచార్, కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించండి

● మందులు బయటకు రాయవద్దు
● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
● జీజీహెచ్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీల అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో పార్కింగ్ స్థలాలను గుర్తించినా ఎందుకు ఇంకా వాటిని అమలు చేయలేదని, సూపర్ స్పెషలిస్టు బ్లాక్‌లో ఆపరేషన్ థియేటర్ పనులు ఆలస్యమవుతున్నాయని, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లపై మండిపడ్డారు. ఈనెల 30వ తేదీలోపు వెహికల్ పార్కింగ్, అక్టోబరు 15లోపల ట్రాలీ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. సమీక్షకు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ ఉన్నతాధికారులు ఎందుకు రాలేదని మంత్రి ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు మందులు బయటకు రాయవద్దని డాక్టర్లను ఆదేశించాలని సూపరింటెండెంట్‌ను మంత్రి కోరారు. ఐరన్ స్క్రాప్, జంగిల్ క్లియరెన్స్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్త సిటీ స్కాన్‌ను పీపీపీ మెయింటెనెన్స్ కింద ఇవ్వాలని 135 సీసీ టీవీ కెమెరాలకు అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు 3వేల మంది అవుట్ పేషెంట్లు రావడం జరుగుతుందని, పందుల సమస్య ఉందని హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమీక్షలో కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కే.కృష్ణ ప్రకాష్, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో డా.భాస్కర్, డీసీహెచ్ఎస్ డా.జెఫరుల్లా, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్‌రెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు ప్రదీప్, పద్మజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

దొంగతనాలపై ఫిర్యాదు

ఆసుపత్రిలో ప్రతిరోజు రోగుల ఫోన్లు, పార్కింగ్‌లో పెట్టిన బైక్‌లు, ఆటోలు చోరీలకు గురవుతున్నాయని, హాస్పిటల్ హెచ్‌డీఎస్ సభ్యుడు సాయిప్రదీప్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో కుక్కలు, పందుల బెడద విపరీతంగా ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. శానిటేషన్ ఏజెన్సీతో సూపరింటెండెంట్ మాట్లాడి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కాలేజీ, హాస్పిటల్, హాస్టల్‌లో ఉన్న కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి బయటకు వదలాలని, కర్నూలు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.విశ్వేశ్వరరెడ్డిని మంత్రి ఆదేశించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో సమీక్ష మళ్లీ నిర్వహిస్తానని, ప్రతి 15 రోజులకు ఒకసారి హాస్పిటల్, మెడికల్ కాలేజీ అధికారులు, హెచ్‌డీఎస్ సభ్యులతో కలిసి కూర్చుని సమస్యలపై చర్చించుకుని తన దృష్టికి తీసుకురావాలని మంత్రి తెలిపారు. జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ హాస్పిటల్‌కు రూ.80వేల విలువైన పది స్ట్రెచర్లను, విరాళంగా ఇచ్చారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'జగదేక సుందరి సామా'కు ప్రశంసలు



నాటక ప్రదర్శన అనంతరం కళాకారులను అభినందిస్తున్న అనంతపురం డీఆర్వో మలోల

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారుల 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం ప్రేక్షకుల ప్రశంసలు అదుకుంది. శుక్రవారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ఐదు రోజుల పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. అనంతపురంలోని శ్రీసత్యసాయి నాటకోత్సవ సమితి, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలు అనంతరపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం డీఆర్వో మలోల, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్‌రావు, దక్షిణ భారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు మైఖేల్‌బాబు, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తొలిరోజు నాటకాలను ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా డీఆర్వో మలోల మాట్లాడుతూ... ప్రఖ్యాతి గాంచిన చింతామణి నాటకాన్ని మైమరపించేలా 'సామా' ఉందని కొనియాడారు. రాష్ట్రస్థాయిలో ఈ ప్రదర్శనలు నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈనెల 9 వరకు ఈ నాటకోత్సవాలు కొనసాగుతాయని, అదేరోజు సాయంత్రం బహుమతి ప్రదానం ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఫోన్ ద్వారా తెలియజేశారు.

శాంతి మార్గంలో నడవాలి

● మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్
● ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



మిలాద్ కమిటీ ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వైసీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక 'మిలాద్-ఉన్-నబీ'ని ముస్లింలు ఘనంగా ఘనంగా నిర్వహించుకున్నారు. నగరంలోని సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పాతనగరంలోని లావుబాలీ దర్గా నుంచి రాజ్‌విహార్ వరకు వేలాది మంది ముస్లింలు భారీ ఊరేగింపు నిర్వహించారు. రాజ్ విహార్ సెంటర్‌లో కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. మిలాద్ కమిటీ వ్యవస్థాపకుడు అహ్లె సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు సయ్యద్‌షా షఫీపాషా ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటూ పలువురు ముస్లిం మతపెద్దలు హాజరయ్యారు. హైదరాబాదుకు చెందిన నక్షిబంద్ మౌలానా ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంత పురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

● యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు
● కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉందని అసత్య ప్రచారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ యంత్రాంగం ఎప్పటికప్పుడు ఎంత యూరియా జిల్లాకు సరఫరా అవుతుందని, రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, డీలర్ల వద్ద ఎంత అందుబాటులో ఉందో రైతులకు తెలిసేలా ప్రకటనలు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా పంపిణీకి సంబంధించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలోని వివిధ సంస్థల్లో 1,329 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మొత్తం 6,104 టన్నుల యూరియా జిల్లాలోని రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కౌతాళం, హోళగుంద, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కోసిగి, ఆలూరు,పత్తికొండ, సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారులతో ఇటీవల మాట్లాడామని, ఈ మండలాల్లోనే సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సక్రమంగా రైతులకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నానో యూరియా వాడాలని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మిని ఆదేశించారు.

ప్రగతిశీల కవులకు మార్క్సిజమే మూలవస్తువు



జంధ్యాల రఘుబాబు పుస్తకాలు పరిచయం చేస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల కవులకు మార్క్సిజమే మూలవస్తువు అని ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు రాసిన పుస్తకాలపై సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. రఘుబాబు రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కర్త జి.వెంకటకృష్ణ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘుబాబు కవిత్వం, కథ, పాట, విమర్శ రాయడం అరుదైన విషయమని చెప్పారు. రఘుబాబు తన రచనలు మార్క్సిజం దృష్టికోణంలో రాయడం గొప్ప విషయమని అన్నారు. ఆర్‌యూ తెలుగుశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ అరుణ మాట్లాడుతూ సున్నితమైన అంశాలను తన కథల్లో గాఢమైన వస్తువుగా మార్చి పాఠకులను జంధ్యాల ఆకట్టుకుంటున్నారని ప్రశంసించారు. విరసం నాయకుడు డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ సీమ అస్తిత్వాన్ని ప్రతిపాదించే కవిత్వం జంధ్యాల గొప్పగా రాస్తున్నారని, అందుకు ఆయన రచనలు ఉదాహరణంగా నిలిచిపోతాయని అన్నారు. సభాధ్యక్షత వహించిన స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ విమర్శనాత్మక రచనల్లో కలాన్ని పదునైన ఆయుధంగా ఉపయోగించి సమగ్ర స్వరూపంగా అందించే ఘనత జంధ్యాలకు దక్కుతుందని అన్నారు. చివరగా జంధ్యాల రఘుబాబు తన స్పందన తెలియజేస్తూ లోతైన సాహిత్య అధ్యయనమే మంచి రచయితను తీర్చిదిద్దుతుందని, ఆదిశగా సాగిస్తున్న ప్రయత్నాల్లోంచి రాసిన పుస్తకాలే ఇవి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్రవంతి ప్రతినిధి నాగమణి, ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, మధు బాలగౌని తదితరులు పాల్గొన్నారు.

అవార్డు బాధ్యతను పెంచింది

● ఉత్తమ ఉపాధ్యాయురాలు వినూత
● చంద్రబాబు నుంచి సత్కారం



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు వినూత

పత్తికొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం మరింత బాధ్యతను పెంచినట్లయిందని హోసూరు ఎంపీపీ (డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వినూత వెల్లడించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. సీఎం చంద్రబాబు వినూతను అవార్డు, జ్ఞాపిక, నగదు ప్రోత్సాహం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వినూత 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాధారణ పేద కుటుంబంలో పుట్టిన తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన తల్లిదండ్రులు, విద్యార్థుల తల్లిదండ్రులే కారణమన్నారు. పేదరికంలో ఉన్న ఇబ్బందులు తనకు బాగాతెలుసని అందుకే చదువుకు దూరమయ్యే విద్యార్థులకు అండగా నిలుస్తూ వారిని మంచి విద్యావకాశాల వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

● గేర్ రాడ్డుకు బోల్టులు ఊడిపోవడంతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు


వెంకటగిరి సమీపంలో పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి సమీపంలో ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. వివరాలివీ.. డోన్ డిపోకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం కోడుమూరు నుంచి 21 మంది ప్రయాణికులతో వెల్దుర్తికి బయల్దేరింది. అయితే మార్గమధ్యంలో గేర్ రాడ్డుకు బోల్టులు ఊడిపోవడంతో నియంత్రణ తప్పి రోడ్డుపక్కన పొలంలోకి దూసుకెళ్లింది. అయితే ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తిపై దాడి: ఏడుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్ల బోయ రవికుమార్ అనే వ్యక్తిపై దాడి ఘటనలో ఇదే గ్రామానికి చెందిన ఏడుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. ఈనెల 2వ తేదీన కొలిమిగుండ్లకు చెందిన బోయ వెంకటేష్ మరో ఆరుగురు కలిసి, పాత కక్షలు మనసులో పెట్టుకొని రవికుమార్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పవర్‌గ్రిడ్ కేబుల్ అపహరణ

సంజామల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథ కొండ సమీపంలో జరుగుతున్న పవర్‌గ్రిడ్ పనుల్లో శుక్రవారం 850కిలోల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. పవర్‌గ్రిడ్ సీనియర్ మేనేజర్ సతీష్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పిచ్చికుక్క దాడి

● మహిళకు తీవ్ర గాయాలు



పత్తికొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పత్తికొండలో చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం మదిరి గ్రామానికి చెందిన మహిళ పనినిమిత్తం శుక్రవారం పత్తికొండకు వచ్చింది. పని ముగించుకుని అంబేడ్కర్ కూడలి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుంది. అంతలోనే ఆమెపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో కాలికి తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణంలో గతంలో కొందరు చిన్నారులు కూడా కుక్కల దాడికి గురయ్యారు.

రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు

● ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన గోవింద్


బాధ్యతలు తీసుకుంటున్న గోవింద్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌కు తమ పంట ఉత్పత్తులను విక్రయానికి వచ్చే రైతులకు లాభదాయకమైన ధరను అందించేందుకు, అలాగే ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ ఇన్‌చార్జి కార్యదర్శి కె.గోవింద్ అన్నారు. శుక్రవారం ఆయన ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గోవింద్ మాట్లాడుతూ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, రైతులు హమాలీలను సమన్వయం చేసుకొని సజావుగా పంట ఉత్పత్తులకు విక్రయవిక్రయాలు జరిగేలా చూస్తామన్నారు. గ్రేడింగ్‌పై రైతులకు వ్యాపారులకు నష్టం కలగకుండా కొనుగోలు జరుపుతామన్నారు. సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతపురంలో పనిచేస్తూ ఇక్కడికి ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వేరుశనగ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు మర్యాదపూర్వకం కలిశారు. సహాయ కార్యదర్శి శాంత కుమార్, సూపర్వైజరులు, రాము, నాగరాజు, అశోక్ ఉన్నారు.

2న 'స్వచ్ఛాంధ్ర' అవార్డుల ప్రదానం

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2వ తేదీన మహాత్మా గాంధీ జయంతి రోజున స్వచ్ఛాంధ్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ గవర్నమెంటు ఆఫీసులు, స్వచ ఎన్జీవోస్, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ సంబంధించి ఎంపీడీవోల ద్వారా ఈ నెల 8వ తేదీలోపు నామినేషన్లను ఆన్‌లైన్ ద్వారా డీపీవో కార్యాలయానికి పంపించాలని తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి రిమాండ్

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామంలో తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకును అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన రామాచారినికొడుకు వీరసాయి రోకలితో కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. రామాచారి భార్య వీరుపాక్షమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆస్తి ఇవ్వలేదని తండ్రి ముఖం, తలపై రోకలితో కొట్టి చంపినట్లు తెలిపారు. వీరసాయిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

పాములపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనకచెర్ల పవర్‌హౌస్ వద్ద కేసీ కెనాల్‌లో మహిళ మృతదేహం లభ్యమైంది. విరాలివీ.. కర్నూలు మండలం పూడూరు గ్రామానికి చెందిన మాధవి(24) గతనెల 31న గ్రామ శివారులోని కేసీ కెనాల్‌లో దుస్తలు ఉతికేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె తండ్రి బోరెల్లి కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువులు గత మూడు రోజులుగా కేసీ కెనాల్ వెంట గాలిస్తుండగా పాములపాడు మండలంలో మృతదేహం లభ్యమైంది. కర్నూలు పోలీసులకు సమాచారం అందించడంతో తాలుకా స్టేషన్ ఎస్‌ఐ, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కర్నూలుకు తరలించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారిస్తామని పోలీసులు తెలిపారు.

కేసీ కాలువలో...

కర్నూలు క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసీ కెనాల్‌లో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. గణేశ్ నగర్ సమీపంలో శివాలయం వద్ద ఓ యువతి మృతదేహం కొట్టుకుపోతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మహిళా మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. అలాగే గ్రీన్ పార్కు సమీపంలో కేసీ కెనాల్‌లో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకుపోతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహా న్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మ కాలనీకి చెందిన చాకలి జ్వాలా నరసింహుడు(45) అనే కౌలు రైతు చికిత్స పొందతూ మృతి చెందారు. నరసింహుడు గత ఏడాది 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మినుము సాగు చేశారు. ఈ ఏడాది ఐదెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశారు. కొన్నేళ్లుగా సాగు కోసం రూ.20 లక్షలు అప్పు చేశారు. అయితే ఆ అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో రైతు తన ఇంట్లో గురువారం రసాయన మందు తాగారు. ఆయను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. నరసింహుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

యువతకు ఆదర్శం.. సురవరం

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
● ఉద్యమాలతో ఎంతో ఎదిగారు : రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
● పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా : సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్
● సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యువతకు ఆదర్శం సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డితో కలిసి ఉద్యమంలో పనిచేయడమే కాకుండా తన కుటుంబానికి బంధుత్వం సైతం ఉందన్నారు. రాజకీయాల్లో స్పష్టమైన వైఖరితో ఉండే సుధాకర్‌రెడ్డి అందరినీ కలుపుకుపోయే గుణం ఉదన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.రామచంద్రయ్య అన్నారు. విద్యార్థి ఉద్యమాలతో పాటు జిల్లాలోని మలగవెల్లిలో భూపోరాటం చేసి సుమారు 1100 ఎకరాలు పేదలకు పంపిణీ చేయడంలో సుధాకర్‌రెడ్డి కీతక పాత్ర అన్నారు. అనంతరం సురవరం మిత్రులు రామచంద్రారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షు డు ఎస్వీ మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతామాధు రి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ.సుబ్బారెడ్డి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, భీమలింగప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, లెనిన్‌బాబు, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

సురవరం గొప్పనేత : టీజీ వెంకటేశ్

సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప నేత అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. పార్టీలు, సిద్ధాంత పరమైన విభేదాలున్నా వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రేమగా ఉండేవారని అన్నారు. నగరం నుంచి ఉద్యమాలు ప్రారంభించి చివరకు జాతీయ స్థాయిలో పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్నారు. అలాంటి వ్యక్తికి కర్నూలు నగరంలో ఆయన పేరు నిలిచిపోయేలా చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైనా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

పేదల పక్షాన నిలిచిన.. : ఎంఏ గఫూర్

పేద పక్షాలన నిలిచిన వామపక్ష యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ అన్నారు. ధనిక కుటుంబంలో పుట్టినా పేదల పక్షాన పోరాటం చేశారని కొనియాడారు. నిత్యం పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండి పోరాటం చేశారన్నారు. చిరునవ్వుతో అందరిని పలకరించడం సురవరం సుధాకర్‌రెడ్డి, సీతారాం ఏచూరికి సొంతమన్నారు.

రూ.30కోట్లతో ఉడాయించాడు..

వారణాసిలో దొరికాడు..!


● బంగారు వ్యాపారిని పట్టుకొచ్చిన బాధితులు
● టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత
● విచారణ చేపట్టిన పోలీసులు


టూటౌన్‌కు చేరుకున్న బాధితులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ బంగారు వ్యాపారి రూ.30కోట్లతో ఉడాయించాడు. వారణాసిలో ఉన్నాడన్న సమాచారంతో బాధితులు అతడిని నంద్యాలకు తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని సుంకులమ్మ వీధికి చెందిన శివ (శివ జూవెలర్స్ యజమాని) చాలా మంది వద్ద బంగారు ఆభరణాలు చేయిస్తానని డబ్బులు తీసుకొని పది నెలల క్రితం ఉడాయించాడు. బాధితులు విచారణ చేపట్టగా అతడు వారణాసిలో ఉన్నాడని సమాచారం అందించింది. ఈ మేరకు కొంత మంది అక్కడికి వెళ్లి శుక్రవారం అతడిని నంద్యాలకు తీసుకువచ్చారు. గతంలో కూడా శివ మీద రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. దీంతో అతడిని అక్కడ అప్పగించారు. చీటీలు, బంగారు ఆభరణాలు చేయిస్తానని చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నాడు. పదేళ్ల నుంచి దుకాణం నడుపుతుండడంతో బాధితులు నమ్మి డబ్బులు ఇచ్చారు. శివ టూటౌన్‌లో ఉన్నాడని తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకుని అతనిపై ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఒక బంగారు దుకాణం యజమానికి కూడా కేజీ బంగారం వరకు లావాదేవీల్లో ఇవ్వాలని ఉన్నట్లు సమాచారం. ఇలా చాలా మంది బంగారు దుకాణాల వ్యాపారులను సైతం మోసం చేసినట్లు తెలిసింది. వారంతా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. బాధితులు నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారూ.. ఆన్‌లైన్‌లో ఎక్కించరూ..

● ఉన్నతాధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు


బాధిత రైతు గంటా రామస్వామిరెడ్డి

పాములపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సారూ.. తన సొంత పట్టాభూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ ఓ రైతు కొన్ని నెలలుగా మొర పెట్టుకుంటున్నాడు. అతడి మొరను అలకించే తీరిక మండల అధికారులకు లేనట్లు కనిపిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత రైతు గంటా స్వామిరెడ్డి ఆరోపించారు. వివరాలు.. మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన గంటా స్వామిరెడ్డి 2010లో అదే గ్రామానికి చెందిన గాండ్ల సుబ్బమ్మకు చెందని సర్వే నెంబర్ 322 బై సీలో 0.52 సెంట్లను కొనుగోలు చేశాడు. ఆ పొలం ఆన్‌లైన్‌లో హరిజన వాడకు చెందిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలుగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేయాలని ఆర్డీవో ను ఆదేశించారు. వేంపెంట గ్రామంలో హరిజనవాడ గృహలకు 322 బై ఎలో 2.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, ఈ 52 సెంట్లు రైతు స్వామిరెడ్డి మిగులుభూమి అని జాయింట్ కలెక్టర్‌కు నివేదికలు పంపించారు. అన్ని పత్రాలు పరిశీలించిన జేసీ మ్యుటేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. దీని కోసం 70 రోజులుగా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తన పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఆదేశించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామన్నా సహకరించడం లేదు

వేంపెంట గ్రామానికి చెందిన స్వామిరెడ్డి చెందిన 52 సెంట్లలో 6 సెంట్లలో స్తూపం ఉందని, మరో మూడు సెంట్లు వేరే వ్యక్తికి, రైతు విక్రయించాడని అవి పోగా 43 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నాం. అయితే 46 సెంట్ల మిగులు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. తమ రికార్డుల ప్రకారం నడుచుకుంటామని చెప్పా. అయినా సహకరించడం లేదు.

\- సుభద్రమ్మ, తహసీల్దార్, పాములపాడు

పట్టుపడ్డ ఎరువులు నకిలీవే..

ఆదోని రూరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పెద్దతుంబళంలో నబీ ఎరువుల దుకాణంలో ఈ ఏడాది జూలై 3వ తేదీన పట్టుపడ్డ స్పిక్ డీఏపీ ఎరువులు నకిలీవేనని ల్యాబ్ నిర్ధారణలో తేలిందని ఏవో సుధాకర్ తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నబీ ట్రేడర్స్ యజమాని ఇలియాస్‌పై పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌లో నాణ్యత ప్రమాణాలు లేనందున ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మహేష్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దుకాణ దారుడు కర్ణాటక నుంచి నకిలీ స్పిక్ డీఏపీని దిగుమతి చేసుకొని రైతులకు అంటగట్టాడని సంబంధిత కంపెనీ సిబ్బంది ఫిర్యాదు మేరకు దుకాణంపై దాడులు నిర్వహించామని ఏవో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాన్ని సీజ్ చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అందులో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పది మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు అవార్డులను అందుకున్నారు. వారికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు జ్ఞాపికలు, మెమొంటో, నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

-కర్నూలు/నంద్యాల (ఆంధ్రజ్యోతి)


గోపాలాచార్యులు, ఉపాధ్యాయులు, బురాన్‌దొడ్డి


డాక్టర్ బి.అనూష, సిల్వర్ జూబ్లీ కళాశాల, కర్నూలు


పి.వెంకట సుబ్బయ్య, నూనెపల్లి హైస్కూల్, నంద్యాల


సీతాపతి, జడ్పీ హైస్కూల్, బలపనూరు


వి.లక్ష్మయ్య, జడ్పీ హైస్కూల్, చాగలమర్రి


షేక్ మగ్బూల్ బాషా, హెచ్‌ఎం, కె.బనకచర్ల పాఠశాల


సంతోష్ కుమార్, జూనియర్ లెక్చరర్, కౌతాళం


సైద్ బాబు, జూనియర్ లెక్చరర్, పాణ్యం


సాయినాథ్ రెడ్డి, లెక్చరర్, నంద్యాల పాలిటెక్నిక్


డాక్టర్ పరిమళ దేవి, డిగ్రీ లెక్చరర్, నందికొట్కూరు

గుప్త నిధుల కోసం వేట

● ధణాపురం పాడుపడ్డ బావిలో తవ్వకాలు
● 12మంది అరెస్టు ● పరారీలో పలువురు


బావిని పరిశీలిస్తున్న ఆదోని రూరల్ సీఐ

ఆదోని రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధణాపురంలో గుప్త నిధుల కోసం వేట కొనసాగింది. గ్రామంలోని సర్వే నెంబర్: 107ఏలో పాడుపడ్డు దిగుబడు బావిలో తవ్వకాలు చేపట్టారు. పోలీసులు ఆదోని మండలంలో లేనప్పుడు తవ్వకాలు ప్రారంభించాలని మాజీ సర్పంచ్ మరి కొందరితో కలిసి పథకం రచించాడు. ఈ మేరకు గణపతి నిమజ్జనం రోజు తవ్వకాలు చేపట్టాలనుకున్నారు. కానీ 10 రోజులుగా మండలంలో వర్షాలు వస్తుండడంతో వీరి పథకం నీరుగారిపోయింది. అయితే కర్నూలులో గురువారం వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తుకు కర్నూలుకు వచ్చారు. వారు తిరిగి వచ్చే లోపు పని పూర్తిచేయాలని అనుకున్నారు. సుమారు పది నుంచి 15మంది దాకా గురువారం రాత్రి ప్రణాళిక వేసి గుప్తనిధులు తవ్వకాల కోసం క్షుద్ర పూజలు చేశారు. మరో అరగంటలో వారి పని పూర్తయ్యేది. ఇంతలోనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ సీఐ శ్రీరాములు సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. 12మందిని అదుపులోకి తీసుకోగా మరి కొందరు పరారయ్యారు.

పాత నేరగాళ్లు ఎక్కువ

గుప్త నిధులు తవ్వకాలు చేపడుతూ చిక్కిన 12మందిలో దాదాపు అందరూ పాత నేరగాళ్లే అని పోలీసులు చెబుతున్నారు. గతంలో వీరు చాలా ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ, గుప్త నిధులు తవ్వుతూ పట్టుపడి కటకటాల పాలైనట్లు తెలిసింది.

రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

ధణాపురంలో గుప్త నిధుల తవ్వకాలు చేపడుతుండగా 12మందిని అదుపులోకి తీసుకున్నాం. మరికొందరు పరారీలో ఉన్నారు. నిందితులందరిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తాం.

● నల్లప్ప, సీఐ, ఆదోని

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలూరుకు చెందిన అక్బర్(35) శుక్రవారం మృతిచెందాడు. మరో ఇద్దరు గాయాలతో గుంతకల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... అసిఫ్, అక్బర్ కలసి పని నిమిత్తం ఆలూరుకు వెళ్లి ద్విచక్రవాహనంలో బయల్దేరారు. దౌల్తాపురం నుంచి చిప్పగిరికి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇబ్రహీం అదుపు తప్పి ఢీకొనడంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. అందులో అక్బర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్బర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎంపిక


జి.బాబురావు


ఆనందరావు

కర్నూలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాలో ఇద్దరు టీడీపీ నాయకులకు అవకాశం కల్పించారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్ల డైరెక్టర్లను నియమించింది. ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలు నగరానికి చెందిన దర్భాడ ఆనందరావుకు అవకాశం కల్పించారు. 15 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ మంత్రి టీజీ భరత్‌కు సన్నిహితుడిగా ఉంటున్నాడు. మంత్రి టీజీ సిఫార్సు మేరకు అవకాశం దక్కింది. మంత్రాలయం నియోజకవర్గం నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది జి.బాబురావుకు అవకాశం ఇచ్చారు. పెద్దకడుబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన ఈయన 20 ఏళ్లుగా పార్టీలో ఉన్నారు. మంత్రాలయం లీగల్ సెల్ ఇన్‌చార్జిగా కూడా పని చేశారు. వైసీపీ హయాంలో గ్రామ సర్పంచుగా పోటీ చేశారు.

యూరియా కోసం క్యూ



ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా యూరియా లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం వెలుగోడు మండలానికి 163 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అయితే శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సెలవు ఉన్నప్పటికి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు స్థానిక అధికారులు యూరియాను పంపిణీ చేశారు. బోయరేవుల, వెలుగోడు, వేల్పనూరు గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. యూరియా తీసుకొనేందుకు రైతులు భారీగా క్యూ కట్టారు. ఈ పంపిణీని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, వ్యవసాయ అధికారిణి స్వాతి, ఎస్ఐ సురేశ్ పర్యవేక్షించారు.

యూరియా పంపిణీ

ఆత్మకూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులకు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారుల సమక్షంలో శుక్రవారం యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏడీఏ హేమలత మాట్లాడుతూ.. రైతుల అవసరాల నిమిత్తం వెంకటాపురం గ్రామంలో 23.94టన్నులు, సిద్ధాపురంలో 23.94టన్నులు, కురుకుంద 23.94టన్నులు, కొట్టాల చెరువులో 11.97టన్నులు, కృష్ణాపురంలో 11.97టన్నులు, శ్రీపతిరావు పేటలో 11.97టన్నులు, వడ్లరామాపురంలో 11.97టన్నుల చొప్పున మొత్తం 119.7టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు వివరించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు ఎరువుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

పాములపాడు: మండలంలోని జూటూరు, చెలిమిళ్ల, రుద్రవరం, ఎర్రూడూరు, వేంపెంట తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రైతులు అవసరాల మేరకు తీసుకెళ్లాలని సూచించారు. కొంతమంది రైతులు రబీకి ఎరువులు నిల్వ చేసుకుంటున్నారన్నారు. రానున్న ఐదురోజుల్లో యూరియా రానున్నట్లు తెలిపారు.

మిడుతూరు: మిడుతూరు మండలంలో 54 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి వీరునాయక్ తెలిపారు. మండలంలోని చింతలపల్లి, చౌట్కూరు, చెరుకుచెర్ల, కడుమూరు గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి శుక్రవారం యూరియా పంపిణీ చేశారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

గడివేముల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని వైసీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌గుప్త డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసీపీ నాయకులు రఘుమాధవరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, నంద్యాల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఆలయాలు మూసివేత

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈనెల 7న ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 8గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నట్లు ఈవోలు లక్ష్మీనారాయణ, రామానుజన్ తెలిపారు. పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం, బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం, గుడిపాటి గడ్డ వెంకేశ్వరస్వామి దేవస్థానం, ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం తదితర ఆలయాలలో దైవదర్శనం ఉండదన్నారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందన్నారు.

పాణ్యం: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం నివేదన అనంతరం ఒంటిగంటకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను అనుమతిస్తామన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కుంటొన్న సమస్యలపై పోరాడతామని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యూరియా కొరతపై తల్లడిల్లుతున్న రైతన్న కోసం ఈనెల 9న కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. రైతులకు యూరియా దొరకక రైతులు అల్లాడుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అమీర్‌బాషా, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రోగులకు సరైన పరీక్షించి మందులను ఇవ్వాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ వైద్యాధికారి గంగాధర్‌కు సూచించారు. జూపాడుబంగ్లాలోని ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించడంలేదని, కొంతమంది విధులకు సక్రమంగా రావడంలేదని తమదృష్టికి వచ్చిందని, పునావృతం అయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ పదవీ విరమణ

శ్రీశైలం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు, సున్నిపెంట జలవనరుల శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వి.లక్ష్మయ్యను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సున్నిపెంటలోని రెడ్ల కల్యాణ మండపంలో తోటి ఉద్యోగులు, ఎస్సీ వెల్ఫే ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, తదితరులు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి సత్కరించారు. జలవనరులశాఖ ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, శ్రీశైలం తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో లక్ష్మయ్య చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేటలో గల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రథమ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుసేన్‌సాహేబ్, పీఆర్‌టీయూ నాయకులు ఇబ్రహీం, కలిముల్లా, ఖాజ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయులు మోమిన్ వలి, రిటైర్డు ఉపాధ్యాయురాలు షాహజాది బానోలను సత్కరించారు. జీ.పుల్లారెడ్డి స్కూల్, గౌతమ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల అకాడమిక్ డైరెక్టర్ సాయిప్రణీత్ మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పాఠశాల హెచ్‌ఎంలు చాంద్‌బాషా, శ్రీనివాసులు ఉన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిని గొప్పగా భావించి విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పీఆర్‌టీయూ నాయకులు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నంద్యాల దేవనగర్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నవ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులే కీలకమన్నారు. కార్యక్రమంలో దేవనాలశ్రీను, కృష్ణారావు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల బాలాఅకాడమీ రవీంద్రస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్, కరస్పాండెంట్ మాధవీలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సర్వేపల్లి చిత్రపటాలకు నివాళులర్పించారు. పాణ్యం మోడల్ పాఠశాల హెచ్‌ఎం దినేష్‌బాబు జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపిక కావడంతో కలెక్టరు సత్కరించి అవార్డు అందజేశారు.

కొత్తపల్లి: ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన మహానుబావుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని విభాగ్ సంగ్ చాలక్ నీలకంఠేశ్వర్, ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు రఘురామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోకవరం భక్తకన్నప్ప గురుకులం ఆవాసం నందు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నీలకంఠేశ్వర్ మాట్లాడుతూ రాధాకృష్ణన్ నిరుపేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి భారతదేశం రెండో ఉపరాష్ట్రపతిగా ఎన్నికై సేవలందించడం గర్వించదగ్గ విషయమన్నారు. రిటైర్డు ఎంఈవో నాగేశ్వరరావు, రిటైర్డు ఉపాధ్యాయులు శంకర్‌సింగ్, చంద్రశేఖర్‌లను ఘనంగా పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి రఘురాములు, రామకృష్ణ పాల్గొన్నారు. రిటైర్డు ఎంఈవో నాగేశ్వరరావు, రిటైర్డు ఉపాధ్యాయులు శంకర్‌సింగ్, చంద్రశేఖర్‌లను ఘనంగా పూలమాలలు వేసి సన్మానించారు. ఆవాస కార్యదర్శి రఘురాములు, కమిటి సభ్యులు రామకృష్ణ పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మొహిన్‌ద్దీన్, నరసింహులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇరువురు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాలలో జిల్లా ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఇరువురిని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

గడివేముల: మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో ఏవో రాఘవేంద్రరావు డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.



మోడల్ పాఠశాల హెచ్‌ఎంను సత్కరిస్తున్న కలెక్టరు



ఆత్మకూరులో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు



నంద్యాలలో..





ఆర్జీఎం కళాశాలలో సర్వేపల్లి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, వెలుగోడులో ఉత్తమ ఉపాధ్యాయులతో సహచర టీచర్లు



గడివేములలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఏవో రాఘవేంద్రరావు

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

వెలుగోడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆసార్ ఎ షరీఫ్‌లో మిలా ద్-ఉన్-నబీని శుక్రవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెలవంక కనిపించిన రోజు నుంచి 12 రోజుల వరకు నాతే షరీఫ్, ప్రవక్త యొక్క సూక్తులను భక్తులకు వినిపించారు. చివరి రోజు మహ్మద్ ప్రవక్త తలనీలాలను భక్తుల సందర్శనార్థం ఉంచారు. భక్తులు ప్రవక్త తలనీలాలను దర్శించుకొన్నారు. వజీరుబాషా, బురానుద్దీన్, రఫీ, ఇనాయతుల్లా, ఖాజమొహిద్దీన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో శుక్రవారం మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా సంతమార్కెట్ సమీపంలోని ఆసర్ మసీద్‌లో ఆసర్ వంశస్థులు మహ్మద్‌ప్రవక్త కేశ దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న ఎస్ఎండీ ఫిరోజ్

నంద్యాల కల్చరల్: నంద్యాలలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ ఫిరోజ్ పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదానం, అన్నదానం శిబిరాన్ని నిర్వహించారు.

నందికొట్కూరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న కేజీఎన్



వెలుగోడులో మహ్మద్ ప్రవక్త తలనీలాలు దర్శించుకొంటున్న భక్తులు

కార్యాలయంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని కేజీఎన్ అధినేత సయ్యద్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మత పెద్ద నయాముద్దీన్ ఖాద్రి మాట్లాడుతూ శాంతి, ప్రేమ, సహనం, త్యాగం, సేవ మార్గంలో జావించాలనే అల్లాహ్ సందేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహమ్మద్ ప్రవక్త జన్మదినమే మిలాద్ ఉన్‌నబీ అన్నారు.

పాణ్యం: మిలాద్ ఉన్ నబీ వేడుకలు పాణ్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆషారే షరీఫ్ దర్గా వద్ద నిర్వహించిన వేడుకల్లో మహ్మద్ ప్రవక్త కేశాలను ప్రదర్శించారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తవలి ఖాదర్‌బేగ్, అఫ్జల్‌బేగ్, జంషీర్‌బేగ్, అర్షద్ హుశేన్‌బేగ్, ముస్లింలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగను ముసింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో గజగౌరీ వ్రతం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

ఆత్మకూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం గజగౌరీ (9 గౌరమ్మల పూజా) క్రతువును ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గజగౌరీ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలను చేపట్టారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చనలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లోకకల్యాణం కోసం గజగౌరీ అమ్మవారికి ఈ పూజలు చేపట్టినట్లు ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు జీవరత్నమ్మ, కార్యదర్శి దేవరశెట్టి కళ్యాణి తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఓనం పండుగ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నంద్యాల అయ్యప్ప స్వామి ఆలయంలో ఓనం పండుగను శుక్రవారం నిర్వహించారు. ఆలయంలో రంగవల్లి వేసి పూలతో అలంకరించారు. దీపారాధన, జ్యోతుల వెలిగించారు. అనంతరం మహామంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో అయ్యప్పసేవా సమాజం సభ్యులు గంగిశెట్టి శ్రీధర్, లయన్ శ్రీకాంత్, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

గడివేముల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దుర్గాభవాని ట్రెడర్స్‌లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, డీసీటీవో వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తనిఖీలు చేశారు. 146 బస్తాల ఎరువుల రికార్డులు సక్రమంగా లేనందున అమ్మకాలు నిలిపి వేశారు. వెంకటేశ్వరట్రెడర్స్‌లో 220 బస్తాల 20-20-0 -13 రిజిస్ట్రర్లు సక్రమంగా లేనందున ఎరువుల అమ్మకాలు నిలిపి వేశారు. ధనలక్ష్మి ఫెర్టిసైడ్‌లో అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు గుర్తించి యూరియా బస్తాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును ఆత్మకూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షహబుద్దిన్, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రాజారెడ్డి, దినకర్ కోరారు. శుక్రవారం అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి పొగాకు ఉత్పత్తుల కొనుగోలు సమస్యలను వివరించారు.

'దాడి ఘటనపై విచారణ'

నంద్యాల టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒక వ్యక్తిని నలుగురు కొడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని, ఈ ఘటనపై విచారిస్తున్నామని టూటౌన్ సీఐ అస్రర్ బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎనిమిది నెలల క్రితం పట్టణంలోని టెక్కె ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేసుకునే వారు కొంత మంది కలిసి ఒక గదిలో బంధించి కాళ్లతో, కట్టెలతో కొట్టారు. అయితే ఎవరూ ఫిర్యాదు చేయలేదు. విచారించగా ఎవరు కూడా అక్కడ ప్రస్తుతం ఉండడం లేదు. అయితే వారు వడ్డీ వ్యాపారం చేసేవారని, తన్నులు తిన్న వ్యక్తికి ఆటో ఇచ్చి వడ్డీకి డబ్బులు ఇచ్చి ఉండోచ్చనని, ఈవిషయంపై విచారిస్తున్నామని తెలిపారు. ఎవరూ ఫిర్యాదు చేయకపోతే, సుమోటగా తీసుకుని కేసు కట్టి దర్యాప్తు చేస్తామని చెప్పారు. ఎస్ఐ సురేష్ సిబ్బంది ఏఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

'శిల్పా ఆరోపణల్లో నిజం లేదు'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన సురేశ్‌పై టీడీపీ శ్రేణులు దాడి చేశారని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని కేసీ కెనాల్ చైర్మన్ బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై శిల్పా లేనిపోని ఆరోపణలు చేస్తూ బురదజల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాంత్, నాగేశ్వరరావు, ఉల్లి మధు, శివ, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో ఆగస్టు 27న ప్రారంభమైన గణపతి నవ రాత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రత్నగర్భగణపతి స్వామి, సాక్షిగణపతి, యాగశాలలో నెలకొల్పిన పంచలోహవరసిద్ధి వినాయకస్వామి, సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతికి వ్రతకల్ప పూర్వకపూజలు, మండపారాధనలు, ఉపనిషత్ పారాయణాలు, జపానుష్టానాలు, గణపతి హోమం, జయాదిహోమాలు చేశారు. పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృథం కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతి స్వామి విశేషంగా పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు సిబ్బంది పాల్గొన్నారు.

● **అంకాళమ్మకు విశేష పూజలు...** శ్రీశైలక్షేత్రంలో వెలసిన గ్రామదేవత అంకాళమ్మకు శుక్రవారం అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించారు. శుక్రవారం త్రయోదశి సందర్భంగా నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, సువర్ణోదకం, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. నానబెట్టిన శనగలను స్వామివారికి సమర్పించారు.

వైభవంగా ఊయలసేవ... లోకకల్యాణార్థం శ్రీశైలక్షేత్రంలో స్వామి అమ్మవార్లకు అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తూ శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు అనంతరం ఊయలసేవ నిర్వహించారు.



గణపతిస్వామికి విశేష పూజలు జరిపిస్తున్న వేదపండితులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: శ్రీశైల క్షేత్రంలో నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరు కాశీనాగ విశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ వారిచే శ్రీకృష్ణరాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించారు. నాటకంలో శూలపాణి, నర్సింగ్‌రావు, రమేష్, బసవయ్య, వెంకట్, వెంకటేశ్వర్లు, పుండరీకాక్షయ్య, శ్రీనివాస్, శేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై కత్తులతో దాడి

నంద్యాల టౌన్/ మహానంది, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం అయ్యలూరులో గురువారం రాత్రి యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కళ్లల్లో కారం కొట్టి దాడి చేశారు. నంద్యాల తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సురేశ్ అనారోగ్యం బాధపడుతూ అయ్యలూరు వద్ద వైద్యుడి వద్ద వచ్చారు. వైద్యం చేయించుకుని వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కళ్లల్లో కారం కొట్టి కత్తులతో దాడి చేశారు. స్థానికులు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన వ్యక్తిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు ముగ్గురు అనుమానితులుగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసింది టీడీపీ నాయకులే: శిల్పా

టీడీపీ నాయకులే సురేశ్‌పై దాడి చేశారని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆరోపించారు. దాడిలో గాయపడిన సురేశ్‌ను ఆయన నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పరామర్శించారు. శిల్పా మాట్లాడుతూ శ్రీశైలం నియోజక వర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లేని పక్షంలో పార్టీ తరపున పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం వెంకటాపురం గ్రామంలోని ఎస్సీ వసతి గృహంలో బైర్లూటి పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. వసతి గృహాలలో విద్యార్థులు ఎక్కువగా గజ్జి, తామర లాంటి చర్మ వ్యాధులకు గురికాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మద్యం స్వాధీనం

శ్రీశైలం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు శ్రీశైల దేవస్థానం సీఎస్‌వో బి.శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ ధర్మదాయ చట్టాన్ని ఉల్లఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులు, స్థానికులు సహకరించాలని కోరారు. వ్యక్తిని పోలీసులకు అప్పగించామని చెప్పారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ



బనగానపల్లె, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, కమిటీ మాజీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

రైతులకు యూరియా అందించాలి

బనగానపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రైతులకు కొరత లేకుండా యూరియాను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య కోరారు. శుక్రవార ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈనెల 8న బనగానపల్లె తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, శివనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సమీక్షలో పాల్గొన్న వైద్యసిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నూర్జహాన్ సూచించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'విజృంభిస్తున్న విషజ్వరాలు' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆళ్లగడ్డలోని సద్దాం కాలనీ, రామలక్ష్మి కొట్టాల, దొమ్మర కాలనీ నగరం, బాచేపల్లె, అహోబిలం, ఓబులంపల్లె, తదితర గ్రామాలలో మురుగు నిల్వ ఉన్న చోట వేస్ట్ అయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. అలాగే వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అహోబిలం వైద్యాధికారి లిఖిత్‌కుమార్ ఓబులంపల్లె గ్రామంలో పర్యటించి దోమల మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంకటరమణ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివచంద్రరెడ్డి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసమే ఏర్పాటు



మాట్లాడుతున్న సంస్థ ఫౌండర్ తిప్పన్న

డోన్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలోని దివ్యాంగుల కోసమే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సెక్రెడ్ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ తిప్పన్న అన్నారు. శుక్రవారం జగదుర్తి గ్రామ సమీపంలో సెక్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల కృత్రిమ అవయవాలు, సహాయ పరికరాల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ప్రారంభించారు. సభ్యులు చంద్రశేఖర్, ఏరియా కోఆర్డినేటర్ శివశంకర్, ఆర్థో టెక్నీషియన్ ఆది శేషయ్య, ఫిజియోథెరపిస్టు మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.



డోన్ పాతబస్టాండులో..



చాలగమర్రిలో..



బనగానపల్లెలో..

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

- మసీదుల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు
- గ్రామాల్లో ర్యాలీలు
- అన్నదాన కార్యక్రమాలు





రుద్రవరం, సంజామలలో మసీదుల్లో నమాజ్ చేస్తున్న ముస్లింలు

డోన్ రూరల్/చాగలమర్రి/కొలిమిగుండ్ల/రుద్రవరం/బనగానపల్లె/ సంజామల/ప్యాపిలి/బేతంచెర్ల/ఉయ్యాలవాడ/దొర్నిపాడు/శిరివెళ్ల/ అవుకు/ ఆళ్లగడ్డ/ కోవెలకుంట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ మండలాల పరిధిలోని గ్రామాల్లో ముస్లిం సోదరులు మిలాద్-ఉన్-నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ర్యాలీలు నిర్వహించారు. అన్నదానాలు చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త విశిష్టతను వివరించారు. ఐదుసార్లు నమాజ్ చేయాలని సూచించారు. నిత్యం దైవనామ స్మరణలో ఉండాలన్నారు. ప్రవక్త చూపిన మార్గంలో నడవాలన్నారు. వేడుకల్లో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చాలగమర్రిలో మత పెద్దలు పెట్టెల్లో భద్రపరిచిన మహ్మద్‌ప్రవక్త తల వెంట్రుకలను ప్రదర్శించారు. బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



బనగానపల్లెలో ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మతపెద్దలు



ప్యాపిలిలో..



చాగలమర్రిలో మహ్మద్ ప్రవక్త తలవెంట్రుకలను చూపుతున్న మత పెద్ద

సొసైటీని అభివృద్ధి చేస్తా

- నూతన చైర్మన్ అంబటి వివేక్
- ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



చైర్మన్ వివేకానందరెడ్డిని అభినందిస్తున్న నాయకులు మూలే, వీఆర్ తదితరులు



సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్మన్ వివేకానందరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో కొలిమిగుండ్ల ప్రాథమిక సహకార సంఘాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని నూతన చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల సొసైటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. చైర్మన్‌గా వివేకానందరెడ్డి, సభ్యులుగా శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయ దినోత్సవం కావడంతో సర్వేపల్లి చిత్రపటానికి వివేకానందరెడ్డితో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి మాట్లాడుతూ అంబటి కుటుంబానికి మంత్రి బీసీ సముచిత స్థానం ఇచ్చారన్నారు. సొసైటీకి నూతన భవనం నిర్మించి, రైతులకు సహకార బ్యాంకును అందుబాటులోకి తీసుకవస్తామని మంత్రి బీసీ హామీ ఇచ్చినట్లు మూలే రామేశ్వరరెడ్డి తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు వీఆర్ లక్ష్మీరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు పులిప్రకాశ్‌రెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, గొంగటి హుస్సేన్‌రెడ్డి, నంద్యాల ప్రసాదు, కామిని క్రిష్ణరంగారెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, పోతిరెడ్డి రాఘవరెడ్డి, ఉలువల నరసింహుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం



సర్టిఫికెట్లు అందుకుంటున్న దాతలు

బేతంచెర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రక్తదానం మహాదానమని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో మత సామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలకు డీఎస్పీ శ్రీనివాసులు సర్టిఫికెట్లును అందజేశారు. కార్యక్రమంలో బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, బేతంచెర్ల ఎస్ఐ రమేష్‌బాబు, వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి, పారిశ్రామికవేత్త మారుతి శర్మ, బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, గౌరి హుశేన్ రెడ్డి, ముర్తుజావలి, జాకీరుల్లా బేగ్, సత్తార్ హాజీ, బాబుల్ రెడ్డి, సాహెబ్, హఫీజరెహిమాన్, విశ్వనాథరెడ్డి, మత సామరస్య చైతన్య వేదిక ప్రెసిడెంటు నూర్ అహ్మద్, సెక్రటరీ జయంత్ గౌడు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.









మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి నుంచి జిల్లాస్థాయి అవార్డులు అందుకుంటున్న పూజారి శ్రీనివాసులు (బనగానపల్లె), మహబూబ్‌బాష(చాగలమర్రి), సుదర్శన్ (రుద్రవరం), ఖాసీంసాహెబ్ రుద్రవరం)

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి సమాజాభివృద్ధికి పాటు పడాలని కోరారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి సన్మానించి అవార్డులను అందజేశారు. అలాగే మండలాల్లో ఉపాధ్యాయులను సన్మానించారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



సంజామలలో..



డోన్‌రూరల్‌లో..



చాగలమర్రిలో..



బేతంచెర్లలో..



డోన్‌టౌన్‌లో..



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



కోవెలకుంట్లలో..



బనగానపల్లెలో..



శిరివెళ్లలో..



ప్యాపిలిలో..

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

చాగలమర్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం అత్యంత కమనీయంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా వేద పండితులు అనిల్‌కుమార్ దంపతులు కామిశెట్టి ప్రసాద్, ప్రమీల, లక్ష్మీనర్సమ్మ, భవ్యశ్రీ దంపతులతో కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. అనంతరం ప్రత్యేక పూజలు, గోవిందనామ పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి పల్లకితో ఊరేగింపు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టణ సీఐకి సత్కారం

డోన్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు, సంఘం సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సీఐ సర్కిల్ కార్యాలయంలో ఆయన్ను కలిసి శాలువలతో సన్మానించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో యూరియా

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శనివారం నుంచి యూరియా అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. ఒక్కో ఆరెస్కేలో సుమారు 590 బ్యాగులు యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా యూరియా అవసరమైన వారు మాత్రమే తీసుకవెళ్లాలని సూచించారు. ఈ-క్రాప్ ఆధారంగా పంట సాగు చేసిన వారికి మాత్రమే యూరియా అందిస్తామన్నారు.

46వేల ఎకరాలకు సాగునీరు

చాగలమర్రి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో టీజీపీ కాలువ ద్వార 46 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం టీజీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీజీపీ ప్రధాన కాలువలో 3,600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, అనుమతి లేనిదే గేట్లను ఎత్తరాదని సూచించారు.

నేడు చౌడేశ్వరీదేవి జ్యోతులు



కోవెలకుంట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో శనివారం చౌడేశ్వరీదేవి జ్యోతులు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు గజ్జల ఉసేనయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాలయ పౌర్ణమి పురస్కరించుకుని గ్రామంలో చౌడేశ్వరిదేవి ఆలయంలోని అమ్మవారికి జ్యోతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మను ఆహ్వానించామన్నారు. సమావేశంలో రాధాక్రిష్ణమూర్తి, దూదేకుల హుసేనయ్య, మనోహర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాల మూసివేత

బేతంచెర్ల/బనగానపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలను ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు ఉప కమిషనర్, ఈవో రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. మరుసటి రోజు సోమవారం తెల్లవారుజాము 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి సంప్రోణ అనంతరం స్వామివారి దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే బనగానపల్లె మండలం యాగంటి క్షేత్రాన్ని, నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయాన్ని ఆదివారం మూసివేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి , ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు ఈవిషయాన్ని గమనించి ఆలయ దర్శనానికి రావాలన్నారు.

ఘనంగా పేపర్ బాయ్స్ దినోత్సవం

బేతంచెర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేపర్‌బాయ్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్‌బాయ్ మోహన్‌రెడ్డిని రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, రమణ, సభ్యులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్

డోన్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. కాంట్రాక్టర్ గోవిందుకు పలు సూచనలు చేశారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, జాకీర్, డీఈ, రఘు, ఏఈ సురేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. డోన్, బేతంచెర్ల నేషనల్ హైవే పనులు జరుగుతున్నందు మార్కెట్ యార్డు, జూనియర్ కాలేజీ, రైల్వేస్టేషన్, సీపీఐ కార్యాలయం, త్రీవర్ణ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ అహోబిలంలో నమోనారాయణ టర్నింగ్ వద్ద శుక్రవారం జరిగిన ఆటో ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఎగువ అహోబిలం నుంచి దిగువ అహోబిలంకు వస్తుండగా మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వడ్ల రాజ్యలక్ష్మితో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స కోసం ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బేతంచెర్ల పాతబస్టాండులో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నాయకులు విలంక సుబ్బరాయుడు, వై.ఎల్లయ్య ఎం.మధుశేఖర్, జి.షేబారాణి, ఖాజాబాషా, డి.రాజు, హరికృష్ణ, వెంకటరమణ, టింగు, శ్రీనివాసులు, మాలిక్‌బాషా పాల్గొన్నారు.